



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 19-03-2024 సంపుటి : 06 సంచిక : 186 పేజీలు : 8 వెల : రూ



# జగన్ ఎన్నికల ప్రచారానికి రంగం సిద్ధం

**మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర**
**దాదాపు 21రోజులపాటు సాగనున్న పర్యటన**

అమరావతి,మార్చి18: అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ భారీ ఎన్నికల ప్రచారానికి సిద్ధం అవుతోం ది. ఈ నెల 26 లేదంటే 27వ తేదీ నుంచి ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలోకి దిగబోతున్నారు. మేమంతా సిద్ధం పేరుతో దాదాపు 21రోజులపాటు బస్సు యాత్ర కొనసాగనుంది. ఒక పార్లమెంటరీ స్థానం పరిధిలోని అన్ని నియోజకవర్గాలు కవర్ అయ్యేలా కొనసాగనుందని తెలుస్తోంది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా నెలరోజులపాటు మేమంతా సిద్ధం బస్సు యాత్ర కొనసాగనుంది. 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఏపీలో ఎన్నికల హడావిడి మొదలైంది. షెడ్యూల్ విడుదల అనంతరం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. పార్టీలన్నీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల రేసులో అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించి, సిద్ధం సభలతో వరుస బహిరంగ సభలు నిర్వహించి దూకుడు ప్రదర్శించాడు. ఇప్పుడు ప్రచారం విషయంలో కూడా జగన్ అదే దూకుడు ప్రదర్శిస్తున్నాడు.

'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు జగన్. ఈ నెల 27న ప్రారంభం కానున్న జగన్ బస్సు యాత్ర ఇచ్ఛాపురం నుండి ఇడుపులపాయ వరకు సాగనుంది. ఈ యాత్ర జిల్లాల వారీగా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఈ యాత్ర జరగనుంది. ఈ మేరకు రీజనల్ కోఆర్డినేటర్లతో సమావేశ మైన జగన్ బస్సు యాత్ర షెడ్యూల్ ఫిక్స్ చేశాడు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి పోలింగ్ తేదీకి 50రోజులకు పైగా గ్యాప్ ఉన్న నేపథ్యంలో జగన్ వీలైనన్ని ఎక్కువ రోజులు ప్రచారానికి కేటాయించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ 175 మంది అభ్యర్థుల్ని ప్రకటించేసింది. మేనిఫెస్టో రూపకల్పన కూడా తుది దశకు చేరుకుంది. ఇక మిగిలిందల్లా.. ఎన్నికల ప్రచార శంఖారావం పూరించడం. అందుకోసం 'మేమంతా సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను చేపట్టబోతున్నారు. మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా.. ప్రతి రోజూ ఒక జిల్లాలో బస్సు యాత్ర కొనసాగనుంది. ఉదయం ఇంటరాక్షన్, మధ్యాహ్నం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. తద్వారా ఈ యాత్రలో ప్రజలతో మమేకం అవుతూ.. ప్రజల నుంచి సలహాలు సూచనలు తీసుకోనున్నారాయన. తొలి విడతలో బస్సు యాత్ర, ఆతర్వాత ఎన్నికల ప్రచార సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రీజియన్ల వారీగా ఇప్పటికే సిద్ధం పేరుతో సభలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జిల్లాల వారీగా, పార్లమెంటు నియోజకవర్గా



ల్లో మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్రలు నిర్వహించబోతుంది వైఎస్సార్‌సీపీ. బస్సు యాత్ర సందర్భంగా పూర్తి క్షేత్రస్థాయిలోకి వైఎస్ జగన్ వెళ్లనున్నారు. బస్సు యాత్రపై, సభలపై పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తామని వైఎస్సార్‌సీపీ చెబుతోంది. ఇక.. ఎన్నికల కార్యాచరణ రూపొందించు కోవడానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్లతో ఇవాళ మధ్యాహ్నం ఆయన భేటీ కానున్నారు. జిల్లాలు.. నియోజకవర్గాల వారీగా సీఎం జగన్ ప్రచార పర్యటనలు ప్రధానాంశంగా ఈ భేటీ జరగనున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఏయే తేదీల్లో ఎక్కడెక్కడ పర్యటనలు కొనసాగాలి.. రూట్ మ్యాప్ ఎలా సాగాలి.. తదితర అంశాలపై ఈ కీలక సమావేశంలో చర్చించ నున్నట్లు తెలుస్తోంది. అలాగే.. మూడు పార్టీల కూటమి బండారాల్ని ప్రజల ముందు ఉంచేలా కార్యచరణ రూపకల్పన, జిల్లాల వారీగా పరిస్థితులపై కూడా చర్చించే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్ ఒక ట్రెండ్ సెట్టర్. గత ఎన్నికలప్పుడు.. విజయ శంఖారావం పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించి 151 స్థానాలు దక్కించుకుని సూపర్ సక్సెస్ అయ్యారాయన. ఉత్తరాంధ్ర ఇచ్ఛాపురం నుంచి మొదలుపెట్టి.. రోడ్‌షోలు, బహిరంగ సభలతో జనాల్లోకి బలంగా దూసుకుపోయారు. ఈ క్రమంలో.. ఈసారి ప్రచార శైలిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం, పోలింగ్ కు మరో 55 రోజులు ఉండడంతో వచ్చే రోజుల్లో వీలైనంతవరకు ప్రజల మధ్యనే ఉండేందుకు సీఎం జగన్ సన్నాహాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను వైఎస్సా ర్‌సీపీ రూపకల్పన చేయబోతోందని తెలుస్తోంది. దాదాపు ప్రతి నియోజ కవర్గంలో ఆయన పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే.. అన్ని వర్గాలను కలవడం ద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి గురించి మరింత ముందుకు తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కాంగ్రెస్ పార్టీ అనూహ్య నిర్ణయం

**షర్మిలను కడప ఎంపి బరిలో దించే యోచన**
**పార్టీ ఆదేశాలను అనుసరిస్తానన్న షర్మిల**
**టిడిపి కూటమి సభపై షర్మిల విసుర్లు**

అమరావతి,మార్చి18:కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పోటీ చేయనున్నారు. కడప నుంచి పోటీ చేయాలని ఆమెపై కాంగ్రెస్ అధిష్టానం ఒత్తిడి తెచ్చింది. హస్తం పెద్దల ఆదేశాల మేరకు ఆమె కడప ఎంపీగా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 25న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయనున్నారు. అటు, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చేలా షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విశాఖలో 'న్యాయ సాధన సభ' పేరిట నిర్వహించిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ పై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో ఏపీ ప్రజలు షర్మిలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాగా, త్వరలోనే తొలి జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ప్రచారం మరింత ముమ్మరం చేసేలా షర్మిల నేతలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'ప్రజాగళం' సభపై షర్మిల ట్విట్టర్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. అటు చంద్రబాబును, ఇటు జగన్ ను 2 పంజరాల్లో పెట్టుకుని ఆడిస్తోన్న రింగ్ మాస్టర్ బీజేపీ అంటూ మండిపడ్డారు. పదేళ్ల రాష్ట్ర వినాశనంలో ముఖ్య పాత్ర పోషించిన పార్టీ బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం అంటూ ఆమె నిప్పులు చెరిగారు. 'కాంగ్రెస్,



వైసీపీ ఒకటే అని ప్రధాని మోదీ కూతలా? ఐదేళ్లుగా జగన్ తో అంటకాగిందెవరు. వైసీపీ నేతల అరాచకాలను అడ్డుకోకుండా, ఎదురు వారికి అడ్డగోలు సహాయ సహకారాలు అందించింది బీజేపీ. ఇంకా నాశనం చేసుకోండి, ఇంకా అప్పుతెచ్చుకోండి అంటూ తెరచాటు స్నేహం నడిపింది ఎవరో, దత్తపుత్రుడు అన్నది ఎవరినో.' అంటూ సెటైర్లు వేశారు.

# వైఎస్ కుటుంబంలో మళ్లీ పోటీ

కడప,మార్చి18:ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలు తారాస్థాయిలో జరగబోతున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని విధంగా ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా కనిపిస్తున్నాయి. ఏకంగా అన్నపై ఇన్ని రోజులు విమర్శలు చేస్తూ వచ్చిన షర్మిల ఆయన్నే ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. కడప ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇది నేరుగా అన్న జగన్‌పై పోటీ కాకపోయినా ఆయన నమ్మిన బంటుగా ఉన్న అవినాష్‌ను ఢీ కొడుతున్నారు. వైఎస్ ఫ్యామిలీ ÷ట్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది. వైఎస్ వివేక హత్య కేంద్రంగా వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో అవినాష్ పాత్ర ఉందని వైఎస్ వివేక కుమార్తె సునీతతోపాటు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపిస్తూ వస్తున్నారు. సొంత బాబాయ్ ను హత్య చేసిన అవినాష్‌కు జగన్ సహాయం చేస్తున్నారని ఆయన్ని కాపాడుతున్నారని మండిపడుతున్నారు. వైఎస్ వివేక హత్య కేసులో అవినాష్ ప్రధాన ముద్దాయి అంటూ షర్మిల, సునీతతోపాటు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి విమర్శలు పట్టించుకోని జగన్... అవినాష్‌కు కడప ఎంపీ టికెట్ మరోసారి ఇచ్చారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తన సపోర్ట్ పూర్తిగా అవినాష్‌కే ఉంటుందని చెప్పకనే చెప్పేశారు. వారి విమర్శలకు ఇలా సమాధానం చెప్పారు. అవినాష్ కడప ఎంపీగా వైసీపీ తరపున పోటీ చేస్తుండటంతో అక్కడ ఆయనకు పోటీగా సునీత కానీ ఆమె తల్లి సౌభాగ్యమ్మ కానీ పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా షర్మిలయే అక్కడ పోటీకి దిగబోతున్నారు. నేరుగా అవినాష్‌తో ఢీ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా దీనిపై ఇంత వరకు సమాచారం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వర్గాల నుంచి అందుతున్న

**అవినాశ్‌కు వ్యతిరేకంగా పోటీలోకి షర్మిల**
**అన్నను టార్గెట్ చేసిన పిసిసి చీఫ్**
**రసవత్తరం కానున్న కడప ఎన్నికలు**

సమాచారం ప్రకారం కడప ఎంపీ స్థానానికి షర్మిల పేరు ఖరారు అయినట్టు తెలుస్తోంది. వైసీపీ పునాదులు రక్తం తడిసి ఉన్నాయని ఆరోపిస్తూన్న సునీత, షర్మిల ఇప్పుడు వారిపైనే పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇలా వైఎస్ ఫ్యామిలీ పోటీ కొత్తకాదు. గతంలో వైఎస్ వివేకానంద కూడా వైఎస్ విజయపై పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో కాంగ్రెస్‌ను విభేదించి పార్టీ పెట్టుకున్న జగన్, విజయమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. అప్పట్లో విజయమ్మ రాజీనామాతో పులివెందులకు, జగన్ రాజీనామాతో కడప ఎంపీ స్థానానికి ఉప ఎన్నికలు వచ్చాయి. ఆయనకు డిపాజిట్లు కూడా రాలేదు. అలాంటి పోటీ ఇప్పుడు మళ్లీ వైఎస్ ఫ్యామిలీలో కనిపిస్తోంది. వివేక హత్య కేసులో ప్రధాన నిందితుడు అవినాష్ అని ఆయన్ని జగన్ ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావడంలేదని షర్మిల ఆరోపిస్తున్నారు. తండ్రిలేని సునీతకు తాను అండగా ఉంటానని... దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించబోనని మొన్ననే ప్రకటించారు. అయితే షర్మిల ఎక్కడైనా అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తారని...సునీతను లేదా సౌభాగ్యమన్ను కడప పార్లమెంట్ స్థానంలో నిలబెడతారని అనుకున్నారంతా. దీనిపై వారిద్దరిని చాలా సార్లు ప్రశ్నిస్తే సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతామంటూ దాటవేశారే తప్ప సమాధానం చెప్పలేదు. ఇప్పుడు ఆ ప్రశ్నలకు సమాధానం దొరికినట్టు అయింది.

## డబుల్ ఇంజిన్‌తోనే వికసిత ఆంధ్రప్రదేశ్ సాధ్యం

**బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్**

అమరావతి,మార్చి18: వికసిత ఆంధ్రప్రదేశ్ కావాలంటే ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ తెలిపారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పది లక్షల మంది ప్రజల స్వచ్ఛంద సహకారంతో నిన్న (ఆదివారం) బొప్పూడి వద్ద జరిగిన 'ప్రజాగర్జన'తో సీఎం జగన్ రెడ్డి తట్ట బుట్ట సర్దుకునే పనిలో నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. జగన్ నాలుగు 'సిద్ధం' సభల్లో అధికార, ప్రజాధన దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఎన్డీఏ మొదటి 'ప్రజాగర్జన' సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని తెలిపారు. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు , జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ ఒకే వేదిక మీద కనపడగానే 2014లో కంటే .. 2024లో భారీ మెజార్టీతో ఎన్డీఏ గెలుస్తుందని జగన్ రెడ్డి, అతని అనుచరులు భయపడిపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం త్రిమూర్తులు ఏకం కావాలని రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటు న్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలను అవినీతి, అరాచక పాలన నుంచి రక్షించుకొని సమ్మిళిత అభివృద్ధి దిశగా ఎన్డీఏ పాలనలో అడుగులు పడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. మోదీ సంకల్పించిన వికసిత భారత్‌లో భాగంగా వికసిత ఆంధ్రప్రదేశ్ కావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ అవసరమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత జగన్ ట్రబుల్ ఇంజన్ సర్కార్ పోయి.. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అయిన డబుల్ ఇంజన్ సర్కార్ అనివార్యమని అన్నారు.

# ప్రధాని మోడీ సభలో భద్రతా వైఫల్యం

**పోలీసులే బాధ్యత వహించాలి**
**ఘటనపై ఇసికి ఫిర్యాదు చేస్తాం: నాదెండ్ల**



అమరావతి,మార్చి18:ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిలకలూరిపేట సభలో భద్రతా వైఫల్యానికి పోలీసులే బాధ్యత వహించాలని.. కొందరు అధికారుల తీరు చూస్తుంటే ఇది కుట్రగా కినిపిస్తోందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన ఇవాళ మాట్లాడుతూ.. మోదీ సభలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. భద్రతలకు సంబంధించిన అంశాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిలకలూరి పేట ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యానికి పోలీసులే బాధ్యత వహించాలని.. కొందరు అధికారుల తీరు చూస్తుంటే ఇది కుట్రగా కినిపిస్తోందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ సభలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. భద్రతలకు సంబంధించిన అంశాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా లేదన్నారు. దేశ ప్రధాన మంత్రి హాజరయ్యే సభకు బ్లాంక్ పాస్‌లు ఇచ్చారని, ఎవరికి జారీ చేస్తున్నారో కనీసం వాళ్ల పేర్లు లేకుండా పాస్‌లు ఇవ్వ డంపై నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రశ్నించారు.

# 6 రాష్ట్రాల్లో హోంశాఖ అధికారులపై ఇసి వేటు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించేందుకు తీసుకునే చర్యలలో భాగంగా గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో హోం కార్యదర్శులను తొలగించాలని, ఎన్నికల కమిషన్ సోమవారం ఆదేశాలు జారీచేసింది. పశ్చిమ బెంగాల్ పోలీసు డైరెక్టర్ జనరల్‌ను కూడా తొలగించాలని ఇసి ఆదేశించింది. అంతేగాక మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌లోని సాధారణ పరిపాలనా శాఖల(జిఎడి)కు చెందిన కార్యదర్శులను కూడా తొలగిస్తూ ఉదేశాలు ఇసి ఆదేశాలు జారీచేసింది .ఈ నెల 16న(శనివారం) లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన సిఇసి రాజీవ్ కుమార్ బృమన్‌ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ ఛాహల్, అదను కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను కూడా తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న లేదా తమ సొంత జిల్లాలలో పనిచేస్తున్న ఎన్నికల సంబంధిత విధులను నిర్వర్తిస్తున్న అధికారులందరినీ బదిలీ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కమిషన్ ఆదేశించింది. కొన్ని మున్సిపల్ కమిషనర్లు, కొందరు అదనపు, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు సంబంధించి మహారాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేయలేదు.దీనిపై ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీపై అసంతృప్తిని వ్యక్తం చేసిన ఎన్నికల కమిషన్ బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కమిషనర్, అదనపు, డిప్యూటీ కమిషనర్లను వెంటనే బదిలీ చేయాలని ఆదేశించింది. మహారాష్ట్రలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్కు సంబంధించిన కమిషనర్లు, అదనపు, డిప్యూటీ కమిషనర్లను కూడా ఇదే ప్రకారం బదిలీ చేయాలని చీఫ్ సెక్రటరీని ఇసి ఆదేశించింది.

# సంపాదకీయం

మంగళవారం 19-03-2024

## సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ని ఈసీ వెల్లడించింది. మొత్తం 7 విడతల్లో పోలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఏప్రిల్ 19 న మొదటి విడత మొదలై జూన్ 1న మలి విడత పూర్తవుతుంది. గత లోక్‌సభ ఎన్నికలనూ ఇలాగే 7 విడతల్లో నిర్వహించింది ఈసీ. అన్నివిడతలు అంటే ఎన్నికల ప్రక్రియ చాలా సుదీర్ఘంగా సాగుతుంది. ఈసారి ఈ విడతల్ని తగ్గిస్తుందని భావించినా అదే తరహాలో కొనసాగించనున్నట్టు తెలిపింది. 1951–52 మధ్య కాలంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తొలిసారి ఇంత సుదీర్ఘంగా సాగాయి. ఇది రెండో అతి పెద్ద ఎన్నికల షెడ్యూల్. మొత్తంగా చూస్తే 44 రోజుల పాటు పోలింగ్ జరగనుంది. అయితే...నోటిఫికేషన్‌లు, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ అన్నీ కలుపుకుంటే మొత్తంగా ఈ ఎన్నికల ప్రక్రియ 82 రోజుల పాటు కొనసాగనుంది. ఇన్ని రోజుల పాటు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నో కారణాలున్నాయి. అందులో ప్రధాన కారణం..గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చి చూస్తే...ఈ సారి 6 రోజుల పాటు ఆలస్యంగా షెడ్యూల్‌ని విడుదల చేయడం. నిజానికి ఎప్పటిలాగే ఈ తేదీల్ని విడుదల చేయాలని ఈసీ భావించినా ఉన్నట్టుండి కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఈ ప్యానెల్‌లో అప్పటికే ఓ ప్లేస్ వేకెన్సీ ఉంది. దానికి తోడు అరుణ్ గోయల్ కూడా వెళ్లిపోయారు. ఫలితంగా ఈ రెండు స్థానాల్ని భర్తీ చేయడానికి కాస్త సమయం పట్టింది. ఆ తరవాత సెలెక్షన్ కమిటీ కేరళకి చెందిన జ్ఞానేశ్ కుమార్, పంజాబ్‌కి చెందిన సుఖ్‌భీర్ సింగ్ సంధులను ఎన్నికల కమిషనర్లుగా నియమించింది. మార్చి 14న ఈ నియామకం జరగ్గా మార్చి 15న వాళ్లు బాధ్యతలు తీసుకున్నారు. ఆ మరుసటి రోజే అంటే మార్చి 16న ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఇక మార్చి,ఏప్రిల్ నెలల్లో వరుసగా పండుగలు ఉండడం కూడా ఎన్నికల షెడ్యూల్ గడువుని పెంచడానికి మరో కారణం. హోలీ, తమిళ కొత్త సంవత్సరం, బైశాఖి తదితర పండుగలున్నాయి. ఈ సెలవు రోజులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్‌లో మార్పులు చేసింది ఎన్నికల సంఘం. వీటితో పాటు భద్రతా కారణాలూ ఉన్నాయి. భద్రతా బలగాలు ఓ విడత ఎన్నికలు ముగిశాక మరో విడత ఎన్నికలకు వేరే చోటకు వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా చాలా పకడ్బందీగా జరుగుతుంది. ఇలా ప్రతి రెండు విడతల మధ్య ఓ చోటు నుంచి మరో చోటుకు వెళ్లాలంటే మొత్తంగా ఆరు రోజుల సమయం పడుతోంది. ఈ మధ్యలో పండుగ రోజులున్నాయి. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ గడువుకి ఎక్కడా ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకుంది ఈసీ. ఫలితంగానే ఇంత సుదీర్ఘంగా ఎన్నికల ప్రక్రియని నిర్వహించాల్సి వస్తోందని ఈసీ వర్గాలు వెల్లడించాయి. జూన్ 1వ తేదీన 7వ దశ పోలింగ్ ముగిసిపోతుంది. జూన్ 4వ తేదీన ఒకేసారి అన్ని ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటలలోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ తొలగించాలిపబ్లిక్ ఆస్తులు– బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయ పరమైన అడ్వర్టైజ్మెంట్లు, రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు వంటివన్నీటినీ వెంటనే తొలగించాలి.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల అడ్వర్టైజ్మెంట్లను నిలిపి వేయాలిప్రభుత్వ వెబ్ సైట్ లో మంత్రులు తదితర ప్రజా ప్రతినిధులు,రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫోటోలను వెంటనే తొలగించాలిఎన్నికల ప్రకటన వచ్చాక మంత్రులెవరూ అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారం వినియోగించరాదుఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికలు జరపాలన్నదే తమ లక్ష్యమని ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ అన్నారు. అభ్యర్థుల వివరాలు ఓటర్లు తెలుసుకోవచ్చని చెప్పారు. కేవైసీ యాప్ లో అన్ని వివరాలు ఉంటాయన్నారు.

## ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు....

**కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ గారు.**
**ప్రజలు స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.**
**ప్రశాంత ఎన్నికలే లక్ష్యం.**




కర్నూలు జిల్లా...జిల్లాలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాల తో పోలీసుల కవాతు.ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడవే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ గారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ గారు తెలిపారు.ఈ రోజు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, ఆదోని సబ్ డివిజన్ లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధ బలగాలైన "సశస్త్ర సీమా బల్" సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని పందిపాడు, ఇందిరమ్మ కట్ట, ఓల్డ్ కల్లూరు లలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నాల్గవ పట్టణ సిఐ శంకరయ్య, ఎస్సైలు మోహన్ కిశోర్, సునీల్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పూలబజార్ , బండిమెట్ట, చత్రభాగ్, గనిగల్లి, పెద్ద రంగరాజు




స్ట్రీట్ , చిత్తారీ విధి, రాంబోట్ల దేవాలయం, గడ్డ స్ట్రీట్, జమ్మిచెట్టు, కమెలా, పెద్ద పడఖానా లలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కర్నూలు ఒకటవ పట్టణ సిఐ పవన్ కుమార్ , ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.హాలహార్వీ పోలీసుస్టేషన్ పరిధిలోని నిత్రావతి, చింతకుంట, మల్లికార్జున పల్లె గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి హాలహార్వి పోలీసులు కవాతు నిర్వహించారు. ఆదోని ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని అమరావతి నగర్, రామ్ నగర్, పై కొట్టాల, కింది కొట్టాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఆదోని ఒకటో పట్టణ సిఐ తేజ మూర్తి, ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారుఆదోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధి లోని నెట్టెకల్, చిన్న పెండెకల్ లో కేంద్రసాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదోని తాలూకా సిఐ నిరంజన రెడ్డి, ఎస్సై ఎర్రి స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.

## చెవి దిద్దులు కొనివ్వలేదని భర్తకు నిప్పు

ఖమ్మం, మార్చి 18,ఎంత అడిగినా చెవి దుద్దులు కొనివ్వడం లేదని ఆ మహా ఇల్లాలు ఏకంగా భర్తకు నిప్పంటించింది. కాలన గాయాలతో భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ షాకింగ్ ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నిజాంపేటలో షేక్ యాకూబ్‌పాషా, సమీనా దంపతులు నివాసం ఉంటున్నారు. దంపతులు ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తనకు బంగారు చెవి దుద్దులు కొనివ్వాలని సమీనా భర్తతో తరచూ పోరు పెట్టేది. ఈ విషయంపై శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో తన వద్ద అంత డబ్బు లేదని, తర్వాత కొనిస్తానని పాషా చెప్పాడు. దీంతో కోపోద్రిక్తురాలైన భార్య సమీనా ఇంట్లో ఉన్న పెయింట్లకు సంబంధించిన రసాయనాన్ని తెచ్చి పాషాపై పోసి నిప్పంటించింది. మంటలు తెలరేగి పాషా తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి మంటలు ఆర్పి ఆసుపత్రికి తరలించారు. పాషా తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలు సమీనాను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రకటనను నమ్మి ఓ వ్యాపారి దాదాపు రూ.40.67 లక్షల సొమ్ము నష్టపోయాడు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉంటోన్న ఓ వ్యాపారి మొబలై ఫోన్‌కు ఈ ఏడాది జనవరిలో గుర్తు తెలియని వ్యక్తులు ఇన్‌స్టాలో ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్ పేరుతో ఓ లింక్ పంపించారు. ఈ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చని నమ్మించారు. అందుకు ఫోన్‌లో మరో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దాని ద్వారా ఎంత లాభం వస్తుందో స్వయంగా చూసుకునే అవకాశం ఉంటుందని నమ్మబలికారువారి మాయమాటలు నమ్మని వ్యాపారి తన వద్ద ఉన్న రూ.40.67 లక్షలను గుర్తుతెలియని వ్యక్తుల ఖాతాకు ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరిలో వారు వ్యాపారి పెట్టుబడికి రూ.19.16 లక్షల లాభాలు వచ్చాయంటూ మరో లింక్ పంపించారు. అది పొందాలంటే 15 శాతం ఆదాయపన్ను చెల్లించాలని, లేదంటే మొత్తం నగదు సంస్థకు తిరిగి వెళ్లిపోతుందని తెలిపారు. వారు చెప్పినట్లు చేస్తున్నక్రమంలో పెట్టుబడి ఖాతాలో వారు చూపిన రూ.19.16 లక్షలు ఉపసంహరించుకుని జీరో బ్యాలెన్స్ చూపారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్‌కు (1930) ఫిర్యాదు చేశాడు. ఆదివారం మరోమారు కేయూ పోలీసు స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు.

## అఫ్గాన్‌పై అర్ధరాత్రి పాక్ వైమానిక దాడులు.. 8 మంది దుర్మరణం, పలు నివాసాలు ధ్వంసం

అఫ్గానిస్థాన్‌పై అర్ధరాత్రి పాకిస్థాన్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. అఫ్గానిస్థాన్‌లోని పక్తికా ప్రావిన్స్‌లోగల బర్మాల్ జిల్లాలో, ఖోస్ట్ ప్రావిన్స్‌లోగల సెపెరా జిల్లాలోని అఫ్గాన్ దుబాయ్ ఏరియాలో ఈ వైమానిక దాడులు జరిగాయి. సాధారణ పౌర నివాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ ఈ వైమానిక దాడులకు పాల్పడింది. తాలిబన్‌ల ఏలుబడిలో ఉన్న అఫ్గానిస్థాన్ అధికార ప్రతినిధి జబివుల్లా ముజాహిద్ ఈ విషయాన్ని వెల్లడించారు.పాకిస్థాన్ వైమానిక దాడుల్లో పక్తికా ప్రావిన్స్‌లోని ఆరుగురు దుర్మరణం పాలయ్యారని, వారిలో ముగ్గురు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారని ముజాహిద్ తెలిపారు. అదేవిధంగా ఖోస్ట్ ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులతో కుప్పకూలిన భవన శిథిలాల కింద చిక్కుకుని మరో ఇద్దరు మహిళలు మరణించారని చెప్పారు.

## శాంతియుత వాతావరణం లో ఎన్నికలు జరగాలి



ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 18 విభారె న్యూస్ :– ఆళ్లగడ్డ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు శాంతియుత వాతావరణం లో జరిగేందుకే బిఎస్ఎఫ్, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్సైలు షేక్ నగీనా, వెంకట్ రెడ్డి లు అన్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరా రెడ్డి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డి.ఎస్.పి షర్ఫుద్దీన్ రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని మంగళ కాలనీ ,పాల సాగరం, పాత బస్టాండ్, టీబీరోడ్ ప్రాంతాలలో 40 మంది బిఎస్ఎఫ్ సిబ్బందితో మరియు పోలీస్ సిబ్బందితో కలిసి ఫుడ్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు తమ యొక్క ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించే విధంగా భరోసా కల్పించారు.

## పట్టణంలోని మూల సాగరంలో బిజెపి కన్వీనర్ అభిరుచి మధు



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 18– నంద్యాల పట్టణం లో మూలసాగరం యందు సోమవారం నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం లో నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పాల్గొన్నారు. వారికి గ్రామ నాయకులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిరుచి మధు మాట్లాడుతూ పారువేట ఉత్సవాల అనంతరం మూలసాగరం గ్రామస్తులు అహోబిల లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బయలుదేరటం అనాదిగా వస్తున్న ఆచారమని తెలిపారు. ఎడ్లబండ్ల మీద గ్రామస్తులు వెళ్ళటం, అక్కడ అన్నదానాన్ని నిర్వహించటం అనాదిగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ జిల్లాల్లో మరో మూడురోజులు వడగండ్లు.. హెచ్చరికలు జారీ చేసిన ఐఎండీ..

తెలంగాణలో పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల ఈదురుగాలులతో వానలు పడుతున్నాయి. మరికొన్ని చోట్ల వడగండ్లు పడడంతో రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతున్నది. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడురోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాల్లో వడగండ్ల వానలు పడే సూచనలున్నాయని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.సోమవారం నుంచి మంగళవారం వరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వానలు పడే ఛాన్స్ ఉందని చెప్పింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్లు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.ఈ నెల 20 నుంచి 21 ఉదయం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఓ వైపు ఎండలతో జనం అల్లాడుతుండగా.. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చల్లగా మారడంతో జనం ఊపిరిపీల్చుకుంటున్నారు. మరో వైపు అకాల వర్షాలకు రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. పలుచోట్ల మామిడి, జామకాయలు నేలరాలుతున్నాయి. మక్క, జొన్న పంటలు దెబ్బతింటున్నాయి.



## పగడ్బందిగా పదవ తరగతి పరీక్షలు

పాడేరు,పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సంబంధిత అధికారులు చేసారు. జిల్లా వ్యాప్తంగా 12,051 మంది విద్యార్ధులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి.ఎస్.ఎస్.సి. 2024 పరీక్షలకు జిల్లా నుంచి 12,051 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారిలో 10,986 మంది రెగ్యులర్ వారు కాగా, 1,065 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ విజయ సునీత వివరించారు. రెగ్యులర్ విద్యార్థులు 10,986 మంది హాజరు అవుతున్నారని, అందులో 5,066 మంది బాలురు, 5,920 బాలికలు హాజరవుతున్నారూ.ఈ మేరకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు.

## కడప పార్లమెంటు స్థానంలో రసవత్తర పోటీ

### కాంగ్రెస్ నుంచి బరిలో దిగనున్న వైయస్ షర్మిల

కడప కడప పార్లమెంటు స్థానంలో రసవత్తర పోటీ జరగనుంది. ఏపీసీసీ చీఫ్ వైయస్ షర్మిల కాంగ్రెస్ నుంచి బరిలో దిగనున్నట్లు సమాచారం. రాబోయే ఎన్నికల్లో 5 ఎంపీ, 25 ఎమ్మెల్యే సీట్లను ఏపీ కాంగ్రెస్ టార్గెట్ గా పెట్టుకుంది. వైకాపా తరపున వైయస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే పోటీలో ఉన్నారు. కడప గడ్డపై అక్క తమ్ముళ్ల డైరెక్ట్ ఫైట్ జరగనుంది. షర్మిలకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో వైయస్ సునీత పాల్గొనే అవకాశం వుంది. షర్మిల, సునీత ఇద్దరూ అవినాష్ ను ఓడించడం ద్వారా వివేకా హత్య కేసులో ప్రజా మద్దతు కోరాలనుకుంటున్నారు.

## ఎమ్మెల్యే అనుచరుడు బార్ లో వీరంగం

కావలి ,నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్య అనుచరుడు హనీఫ్ రాత్రి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బార్ లో బీభత్సం సృష్టించాడు. బారు యజమాని నాయుడు శీను ఉప్పల రమేష్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి రూరల్ ముఖ్య నేత నాయుడు వివేక్ మరియు బార్ సిబ్బంది పై విచక్షణ రైతంగా దాడి చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. హనీఫ్ కు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మద్దతు ఉండడంతో పోలీసులు సైతం నామ మాత్రంగా వ్యవహరిస్తారని విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీలో విధులు నిర్వహించకుండానే మున్సిపాలిటీ నుండి ప్రతినెల హనీఫ్ కు జీతం వస్తుందంటూ ఇందులో ఎమ్మెల్యే చొరవ ఉందంటూ సర్వత్రా విమర్శలు ఉన్నాయి. గతంలో ఆర్టీసీ బస్టాండ్ లో బస్సు డ్రైవర్ పై హనీఫ్ దాడి చేసిన సందర్భాల్లోనూ ప్రతాప్ రెడ్డి రక్షణ కవచంగా నిలిచారని అపవాదును మూటగట్టుకున్న పరిస్థితి.. బారు సిబ్బందినితరిమి కొట్టి వారిపైనే హనీఫ్ కేసు పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికార వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకల సృష్టిస్తున్న పాగడాలపై పోలీసులు ఉక్కు పాదంమో పాలనిపట్టణప్రజలు కోరుకుంటున్నారు..

## మరోసారి వైఎస్సార్సీపీ జెండా ఎగరేద్దాం

### ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరు, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. , ఎమ్మిగనూరు పట్టణంలో 24వ వార్డు నాగప్ప కట్ట లోని స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకొని తరువాత వార్డు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు

# డీబీటీ ట్రాన్స్ ఫర్ లో ఏపీ కొత్త రికార్డు...

విశాఖపట్టణం, మార్చి 18, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర జనాభా కంటే ఎక్కువ సంఖ్యలో లబ్దిదారులకు ప్రయోజనం అందించింది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఒక్కొక్కరికి ఒకటికి మించి నగదు బదిలీ పథకాలకు అర్హత కల్పించడం ద్వారా ఐదేళ్లలో కోట్ల సంఖ్యలో లబ్దిదారులకు ఆర్థిక ప్రయోజనాలు అందాయి.ఏపీలో ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రధానం నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలపై ప్రధానంగా దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కోవిడ్ విపత్తును ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల విషయంలో ప్రభుత్వం ఎన్ని విమర్శలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. సంక్షేమ పథకాల అమలుపైనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ఏపీలో నగదు బదిలీ పథకాల గణాంకాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన లెక్కలు కనిపించాయి. 58నెలల్లో దాదాపు 8,35,04,830మందికి ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో లబ్ది పొందారు. వీటి ద్వారా ఏకంగా రూ.2,58,855.97 కోట్ల రుపాయలు లబ్దిదారుల ఖాతాలకు జమ చేశారుప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో ప్రధానంగా జగనన్న అమ్మఒడి పథకంలో 44,48,865మందికి రూ.26,067.30కోట్లను జమ చేశారు. జగనన్న వసతి దీవెనలో 25,17,245మందికి రూ.4,275.76 కోట్లను అందించారు. జగనన్న విద్యా దీవెన పథకంలో 26,98,728మందికి రూ.12,609.68కోట్లను అందించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో 408మందికి రూ.107.07కోట్లను ఇచ్చారు.వైఎస్సార్ రైతు భరోసా పథకంలో 53,58,366మందికి రూ.34,378.16కోట్లను ఇచ్చారు. రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకంలో 84,66,217మందికి రూ.2,050.53 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంట రుణాల్లో 54,75,651మందికి రూ.7,802.05కోట్లు, రైతులకు ఇన్‌ఫుట్ సబ్సిడీలుగా 22,84,841 మందికి రూ.1976.43కోట్లు చెల్లించారు.వైఎస్సార్ మత్స్యకార భరోసాలో 2,43,443మందికి రూ.538.06కోట్లు, స్వయం సహాయక బృందాలకు సున్నా వడ్డీ పథకం ద్వారా 1,05,13,365 మందికి రూ.4969 కోట్లు అందించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా నెల నెల పెన్షన్ల చెల్లింపులో భాగంగా 66,34,742 మందికి ప్రతి నెల రూ.3వేల చొప్పున 58నెలల్లో రూ.88,650.60కోట్లను చెల్లించారు.వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 26,39,703మంది మహిళలకు రూ.14,129.12 కోట్లను అందించారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 78,94,169మందికి

### 58 నెలలు 8.35కోట్ల లావాదేవీలు

రూ.25,570కోట్లను చెల్లించారు. వైఎస్సార్ బీమా పథకంలో 1,03,171మందికి రూ.1848.70కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తంలో 3,58,613మందికి రూ.2,029.92కోట్లు, వైఎస్సార్ నేతన్న నేస్తంలో 82,130మందికి రూ.982.98 కోట్లు చెల్లించారుజగనన్న చేదోడు ద్వారా రజక, టైలర్లు, నాయి బ్రహ్మణులైన 3,37,802 మందికి రూ.2029.92కోట్లు చెల్లించారు. వైఎస్సార్ లా నేస్తంలో 5781 మందికి రూ.41.52కోట్లు, వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా 2,76,368మందికి రూ.1,302.34 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా ఆరోగ్యచికిత్సలు పొందిన 15,64,997మందికి రూ.971.28కోట్లు, ఎంఎస్ఎంఇ యూనిట్ల పునరుద్దరణలో 23,236మందికి రూ.2,086.42కోట్లు, అగ్రిగోల్డ్ బాధితులైన 10,40,000మందికి రూ.905.57కోట్లు చెల్లించారుఏపీలోని అర్చకులు, ఇమామ్‌లు, మౌజమ్స్, పాస్టర్లకు ఆర్థిక సాయంగా 77,290మందికి రూ.37.71కోట్లను చెల్లించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి కోవిడ్ ప్రత్యేక సాయం చెల్లింపులో భాగంగా 1,35,05,339మందికి రూ.1350.54కోట్లు చెల్లించారు.వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా 4,39,134 మందికి రూ.1257.14 కోట్లు చెల్లించారు. వైఎస్సార్ ఆరోగ్య ద్వారా చికిత్సల రూపంలో 27,39,976మందికి రూ.8845.53 కోట్లను ఖర్చు చేశారు. వైఎస్సార్ కళ్యాణ మస్తు, షాదీతోఫా పథకాల ద్వారా 56,194 మందికి రూ.427.27కోట్లను చెల్లించారు. గృహ నిర్మాణాల లబ్దిదారులకు నేరుగా సాయం అందించడం ద్వారా 21,31,564మందికి రూ.12,295.97కోట్లను చెల్లించారు. జగనన్న తోడు వడ్డీ చెల్లింపు పథకం ద్వారా 15,87,492 మందికి రూ.88.33కోట్లను చెల్లించారు.ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల ద్వరా 2019 జూన్ నుంచి 2024 ఫిబ్రవరి నాటికి మొత్తం 8,35,04,830 మందికి రూ.2,58,855.97కోట్లను నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. ఈ పథకాల్లో అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, స్వయం సహాయక బృందాలకు సున్నా వడ్డీ, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, కళ్యాణ మస్తు, షాదీతోఫా వంటి పథకాల్లో కేవలం మహిళల్ని మాత్రమే లబ్దిదారులుగా గుర్తించారుప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో 8.35కోట్ల మహిళలకు లబ్ది చేకూరినట్టు ప్రభుత్వ గణంకాలు చెబుతున్నాయి. పరోక్షంగా లబ్ది చేకూర్చిన పథకాలను కలిపితే లబ్దిదారుల సంఖ్య 12.84కోట్లకు చేరుతుంది. మార్చి నెలలో నగదు బదిలీ పథకాలను అందుకుంటున్న మహిళలను కలిపితే డిబిటి స్కీమ్స్ ద్వారా నగదు అందుకున్న లావాదేవీల సంఖ్య దాదాపు 9కోట్లకు చేరువలో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# రెడ్డి సామాజికి వర్గానికే వైసీపీ పెద్ద పీట



గుంటూరు, మార్చి 18 వైసీపీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. రెడ్డి సామాజిక వర్గం అంటే వైసిపి అన్న రేంజ్ లో పరిస్థితి ఉండేది. కానీ గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు వైసీపీ నుంచి రెడ్డి సామాజికవర్గాన్ని దూరం చేశాయని టాక్ నడిచింది. అందుకు తగ్గట్టుగానే రెడ్డి సామాజిక వర్గం నేతలు పెద్ద ఎత్తున వైసీపీని వీడారు. తెలుగుదేశం పార్టీలో చేరారు. అటు టిడిపి సైతం రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ పెద్ద ఎత్తున టికెట్లు కట్టబెట్టింది. అయితే తనకు ఏకపక్షంగా మద్దతు తెలుపుతున్న రెడ్డి సామాజిక వర్గాన్ని వదులుకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోక తప్పదని జగన్ గ్రహించారు. అందుకే 175 నియోజకవర్గాల్లో రెడ్డి సామాజిక వర్గం వారికి ఎక్కువ సీట్లు కేటాయించారు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గానికి 49 అసెంబ్లీ సీట్లను కట్టబెట్టడం విశేషం. వారి తరువాత బీసీలకు 41 స్థానాలను కేటాయించారు. ఆ తరువాత స్థానంలో కాపులు నిలిచారు. కాపు సామాజిక వర్గానికి 22 సీట్లు కేటాయించారు. అయితే అదే సమయంలో తమ సామాజిక వర్గానికి కేవలం 9 స్థానాలు మాత్రమే కేటాయించడం విశేషం. తద్వారా తమది రెడ్ల పార్టీ అంటూ జగన్ మరోసారి ముద్ర వేసుకున్నారు.తెలుగుదేశం పార్టీ ఇప్పటివరకు రెండు జాబితాలను ప్రకటించింది. మొత్తం 128 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే టిడిపి 28 మంది కమ్మ అభ్యర్థులను ప్రకటించడం విశేషం. అయితే అక్కడే టిడిపి ఒక పాచిక వేసింది. రెడ్డి సామాజిక వర్గానికి సైతం 28 స్థానాలను కేటాయించింది. బీసీలకు 35 స్థానాలు వరకు ఇచ్చింది. అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీటవేసింది. ఇంకా 16 మంది అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అటు కూటమి కట్టిన బిజెపి, జనసేన ప్రకటించే అభ్యర్థుల సామాజిక వర్గాలను సైతం పరిగణలో తీసుకోనుంది. ఆ మేరకు లెక్కలు కట్టి ప్రకటించనుంది.అయితేవైసిపి మాత్రం 49 మంది రెడ్డి సామాజిక వర్గం అభ్యర్థులను ప్రకటించడం ఒకరకమైన విమర్శకు కారణమవుతోంది. ప్రతిపక్షాలకు అస్త్రంగా మారనుంది. గత ఐదు సంవత్సరాలుగా రెడ్డి సామాజిక వర్గానికి జగన్ అత్యంత ప్రాధాన్యమించినట్లు విమర్శలు వచ్చాయి. రాజకీయ అవకాశాలతో పాటు యూనివర్సిటీల్లో సైతం అదే సామాజిక వర్గంతో నింపేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికల్లో సైతం అదే సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ టిక్కెట్లు కేటాయించడం వెనక జగన్ భయం ఉన్నట్లు విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. ఆది నుంచి అండగా నిలబడిన రెడ్డి సామాజిక వర్గం తన నుంచి దూరమైందన్న భయంతోనే ఆయన టిక్కెట్లు అధికంగా కేటాయించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇంత చేసినా రెడ్డి సామాజిక వర్గం వైసీపీకి అండగా నిలబడుతుందా? లేదా? అన్నది చూడాలి.

# ఎవరి దారి వారిదే...

విజయనగరం, మార్చి 18, ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట. ఇక్కడ అందరూ సీనియర్లే ఉన్నారు. టిడిపినే నమ్ముకొని పనిచేస్తున్న వారే. 2019 ఓటమి తరువాత కూడా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ పార్టీని నిలబెట్టారు. పార్డీ కూడా అలాంటి వారిని గుర్తించి నియోజకవర్గం ఇంచార్జ్?లుగా నియమించింది. వారంతా తమ తమ క్యాడర్?తో నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల సమయం వచ్చింది. దీంతో పార్టీ అధిష్టానం టిక్కెట్ల కసరత్తు పూర్తిచేసి ఆశావహులకు షాక్ ఇస్తూ కొత్త పేర్లు తెర మీదకి తెచ్చింది. దీంతో ఇప్పుడు వారంతా అసమ్మతి రాగం వినిపిస్తూ తమ సత్తా ఏంటో చూపిస్తామని జబ్బలు చరుస్తున్నారు. వారిలో గజపతినగరం ముందు వరుసలో ఉంది. గజపతినగరం నియోజకవర్గంలో ఇన్చార్జిగా డాక్టర్ కేఏ నాయుడు టిక్కెట్ తనదేనని ధీమాగా ఉండేవారు. ఒక సారి 2006 బై ఎలక్షన్?లో, మరోసారి 2009 లో ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత 2014లో తిరిగి ఎమ్మెల్యే గా గెలుపొందారు. 2019 ఎమ్మెల్యే?గా పోటీచేసి ఓటమి పాలయ్యారు. తొలి నుంచి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారు. నియోజకవర్గాన్నే నమ్ముకొని ఉన్న కేఏ నాయుడుని కాదని ఇక్కడ కొండపల్లి శ్రీనివాసరావు అనే కొత్త నేతను పరిచయం చేసింది అధిష్టానం. దీంతో కేఏనాయుడు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఎలాగైనా మార్చాలని పట్టుబడుతూ పార్టీ పెద్దలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇక నెల్లిమర్ల నియోజకవర్గానికి వస్తే ఇక్కడ టీడీపీ ఇంచార్జగా కర్రోతు బంగార్రాజు కొనసాగుతున్నారు. ఈయన పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. అయితే ఇక్కడ పొత్తులో భాగంగా జనసేనకి టిక్కెట్ కేటాయించింది టిడిపి. ఇప్పుడు కర్రోతు బంగార్రాజు రాజకీయ భవిష్యత్తు అయోమయంలో పడింది. టిక్కెట్టు ప్రకటించిన దగ్గర నుండి బంగార్రాజు అసంతృప్తిగానే ఉన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేసి నష్టపోయనని వాపోతున్నాడు. నెల్లిమర్ల కాకపోతే ఏదో ఒకచోట నుండి తనకు టిక్కెట్టు ఇవ్వాలని అధిష్టానంపై కర్రోతు ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కురుపాం నియోజకవర్గంలో ఆశావహుల వర్గం ప్రతినిధిగా దత్తి లక్ష్మణరావు కూడా పట్టు వదలని విక్రమార్కుడులా టిక్కెట్టు కోసం ప్రయత్నాలు సాగించారు. తన వర్గంలో ఉన్న ముగ్గురు మహిళలలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని అధిష్టానం దగ్గర అనేక ప్రయత్నాలు చేశారు. అయినా ప్రయోజనం లేకపోగా తాను వ్యతిరేకించిన తోయక జగదీశ్వరికి టిక్కెట్ దక్కడంతో ఇక్కడ కూడా లక్ష్మణరావు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. ఇక్కడ రెండు వర్గాలు కలిసి పనిచేసేలా కనిపించటం లేదు. సాలూరులో కూడా టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణికి, మాజీ ఎమ్మెల్యే బంజ్ దేవ్ కి ఏ మాత్రం పొసగడం లేదు. ఇక్కడ కూడా ఎవరి దారి వారిదే అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఇలా టిడిపి, జనసేన టికెట్ల ప్రకటన తరువాత అత్యధిక నియోజకవర్గాల్లో అసంతృప్తులే అధికంగా ఉన్నారు. ఇక పార్వతీపురంలో కూడా సేమ్ సీన్. ఇక్కడ కొత్తగా వచ్చిన బోనెల విజయచంద్రకు సీటు కేటాయించడంతో పాత నేతలు ససేమిరా సర్చుకుపోయేది లేదు. తాడో పేడో తే అంటున్నారు. ఇలా దాదాపు అధిక నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ఎలా ముందుకెళ్తుందో అని క్యాడర్ లో అయోమయం నెలకొంది. జిల్లా క్యాడర్ లో నెలకొన్న ఈ అయోమయానికి పార్టీ ఏవిధంగా ఫుల్ స్టాప్ పెడుతుందో వేచి చూడాల్సి ఉంది.

## నాలుగేళ్ల తర్వాత సస్పెన్షన్ క్లోజ్

విజయవాడ, మార్చి 18 ఆర్థికశాఖలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులపై చర్యలు తీసుకుంది ఏపీ ప్రభుత్వం. 2021లో వారిపై సస్పెన్షన్ విధించింది. రాష్ట్ర ఖజానాకు సంబంధించిన కీలక లెక్కల వివరాలు బయటికి వెళ్లటం వంటి పలు కారణాల కోణంలో వీరిపై జగన్ సర్కార్ వేటు వేసినట్లు వార్తలు కూడా వచ్చాయి. 2021లో సస్పెన్షన్ విధించగా? అప్పట్నుంచి వారిని విధుల్లోకి తీసుకోలేదు. వీరి సస్పెన్షన్ వ్యవహారాన్ని నాన్చుతూ వచ్చింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన వచ్చిన రోజే? వీరి దస్త్రాన్ని కదిలించింది. వారిపై విధించిన సస్పెన్షన్ ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. విధుల్లోకి తీసుకుంటున్నట్లు ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.రాష్ట్ర ఆర్థిక శాఖలో వెంకటేశ్వర్లు నాగులపాటి(ఫైనాన్స్ సెక్షన్ సహాయ కార్యదర్శి), కసిరెడ్డి వరప్రసాద్(సెక్షన్ ఆఫీసర్), మరో విభాగంలో సెక్షన్ ఆఫీర్గా శ్రీనివాసులు పని చేస్తున్నారు. వీరిపై ఏపీ ప్రభుత్వం...2021 ఆగస్టు మాసంలో చర్యలు తీసుకుంది. సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కీలక సమచారం బయటికి వెళ్తోందని, సంబంధిత శాఖలో పనిచేసేవారు మీడియాకు సమాచారం లీకు చేస్తున్నారనే అనుమానంతో ఈ చర్యలు తీసుకున్నట్లు చర్చ జరిగింది.ఆ సమయంలో ఈ ముగురిపైనే కాకుండా.... కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న మరో ఐదుగురిని కూడా తొలగించింది. వీరిపై వేటుకు గల కారణాలను ప్రభుత్వం ఎక్కడా అధికారికంగా వెల్లడించలేదు. సస్పెన్షన్ కు గురైన ముగ్గురు అధికారులు అనుమతి లేకుండా అమరావతి దాటి వెళ్లకూడదని కూడా ఆదేశాల్లో పేర్కొంది సర్కార్. ఆర్థి వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన సమాచారం బయటికి వెళ్లటాన్ని ఏపీ సర్కార్ సీరియస్ గా తీసుకుంది. విజిలెన్స్ తో అంతర్గత విచారణకు కూడా ఆదేశించింది. ఈ విచారణలో ముగ్గరి అధికారుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.మూడేళ్లుగా సస్పెన్షన్ లో ఉన్న ముగ్గరి అధికారుల అంశంపై సర్కార్ దృష్టిసారించలేదు. సగటు కాల పరిమితి తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయటం వంటి అంశాలను కూడా పరిశీలించలేదు. ముగ్గరిలో ఒకరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని దాఖలు చేసిన పిటిషన్ పై విచారించిన న్యాయస్థానం.... ప్రభుత్వానికి కూడా ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ వీరి సస్పెన్షన్ వ్యవహారం తేలలేదు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మార్చి 16వ తేదీన ఈ ముగ్గరి అధికారుల సస్పెన్షన్ ను ఎత్తివేసింది ఏపీ ఆర్థిక శాఖ. తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. మూడేళ్లుగా సస్పెన్షన్ వ్యవహారంపై దృష్టి పెట్టని ఆర్థికశాఖ.... ఎన్నికల ప్రకటన వెలువడిన రోజు ఉత్తర్వులు ఇవ్వటం గమనార్హం..!

## రెండు రాష్ట్రాలకు వాటాల లెక్కలు..

విజయవాడ, మార్చి 18,పదేళ్లకు దిల్లీలోని ఏపీ భవన్ విభజనకు మోక్షం కలిసింది. ఏపీ భవన్‌ను విభజన చేస్తూ కేంద్ర హోంశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ భవన్ విభజనపై తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు ఏపీ అంగీకారం తెలిపింది. అశోకా రోడ్డుతో పాటు మాధవరావు సింధియా మార్గ్‌లో కలిపి రెండు రాష్ట్రాలకు 19.733 ఎకరాల భూమి ఉంది. ఇందులో తెలంగాణ వాటాగా 8.245 ఎకరాలు, ఏపీ వాటాగా11.536 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు శబరి బ్లాక్‌లో 3.00 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 5.245 ఎకరాలు కేటాయించారు. అలాగే ఏపీకి 5.781 ఎకరాల్లో ఉన్న గోదావరి బ్లాక్, స్వర్ణముఖి బ్లాక్‌ను కేటాయిస్తూ నిర్ణయించారు. అలాగే ఏపీకి నర్సింగ్ హాస్టల్‌లో 3. 359 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 2.396 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి.దిల్లీలో తెలుగువారికి చిరునామాగా నిలిచే ఏపీ భవన్ ఆస్తుల పంపకం ఎట్టకేలకు పూర్తైంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఆస్తుల పంపకం కొలిక్కి రాకపోవడంతో రెండు తెలుగురాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. తాజాగా ఏపీ భవన్ విభజనపై కేంద్రహోంశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలోనే ఉమ్మడి ఆస్తులను ఏపీ, తెలంగాణకు 52:48 నిష్పత్తిలో పంచారు. దిల్లీ అశోకా రోడ్డుతో పాటు మాధవరావు సింధియా మార్గ్‌లో కలిపి రెండు రాష్ట్రాలకు 19.733 ఎకరాల భూమి ఉంది.విభజన చట్టానికి అనుగుణంగా ఏపీ భవన్ విభజన పూర్తైందని తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లో పూర్తి చేసిందన్నారు. త్వరలోనే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు అనుగుణంగా దిల్లీలో తెలంగాణ భవన్(నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

## కాపులకు సీట్ల సంఖ్య పెంపు

కాకినాడ, మార్చి 18, ప్రతి ఎన్నికల్లోను కాపుల మద్దతు ఉన్న పార్టీ అధికారంలోకి వస్తుంది.ప్రతి ఎన్నికలోను కాపు ఫ్యాక్టర్ పనిచేస్తుంది.అందుకే అన్ని పార్టీలు కాపులకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నాయి.అయితే ఈ ఎన్నికల్లో కాపులు పవన్ కళ్యాణ్ వెంట నడుస్తారని అంచనాలు ఉన్నాయి.పవన్ కూటమిలో ఉండడంతో.. అటువైపు మొగ్గు చూపుతారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. ఈ తరుణంలో జగన్ జాగ్రత్త పడ్డారు. టికెట్ల కేటాయింపులో కాపులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడానికి డిసైడ్ అయ్యారు. అదే సమయంలో ముద్రగడ పద్మనాభం, హరి రామ జోగయ్య కుమారుడు వంటివారికి వైసీపీలోకి రప్పించారు. కాపుల్లో బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలోపడ్డారు.వైసీపీ 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యం ఇస్తూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాపులకు22 సీట్లు ఇచ్చారు. అదే సమయంలోబలిజ,శెట్టిబలిజ,తూర్పు కాపులకు మరో 10 సీట్లు కేటాయించారు. ఈ లెక్కన కాపులకు 32 సీట్లు వరకు కట్టబెట్టారు. అటు తెలుగుదేశం పార్టీ కేవలం ఎనిమిది మంది కాపులకు మాత్రమే సీట్లు ఇచ్చింది. ఇప్పటివరకు ఆ పార్టీ 128 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా 16 మంది అభ్యర్థులు మాత్రమే మిగిలి ఉన్నారు. అందులో కాపులు ఎంతవరకు ఉంటారో చూడాలి.అటు జనసేన, బిజెపి సైతం అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వారు కాపులకు ఎంత ప్రాధాన్యమిస్తారో చూడాలి. అయితే ముందుగా వైసిపి మాత్రం కాపుల విషయంలో జాగ్రత్త పడింది. గత ఐదు సంవత్సరాల పాలనలో కాపుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంది. పవన్ కళ్యాణ్ రూపంలో వారికి ఒక వేదిక దొరకడంతో కాపులు కూటమి వైపు మొగ్గు చూపుతున్నట్లు జగన్ గ్రహించారు. అందుకే కాపుల్లో బలమైన నాయకులను వైసీపీ అభ్యర్థులుగా ప్రకటించారు. ఏకంగా 30కి పైగా టిక్కెట్లు కట్టబెట్టారు. కాపులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు సంకేతాలు పంపించడంలో జగన్ సక్సెస్ అయ్యారు. మరి కాపులు ఎటువైపు మొగ్గు చూపుతారో చూడాలి

## మరోసారి వైఎస్సార్సీపీ జెండా ఎగరేద్దాం: ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక...











ఎమ్మిగనూరు మార్చి 18 విభారె న్యూస్..18-03-2024 తేదీన ఎమ్మిగనూరు పట్టణం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి "బుట్టా రేణుక",ఎమ్మిగనూరు పట్టణంలో 24వ వార్డు నాగప్ప కట్ట నందు స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకొని అనంతరం వార్డు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు. నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తను కలుస్తూ పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలకున్న సమస్యలు వింటూ హామీలు ఇస్తూ నన్ను ఆశీర్వదించండి మీకు తోడుగా నేనున్నాను అంటూ చెప్పడం జరిగింది. రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరు లో వైసీపీ జెండా రెపరేపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుట్టా శివనీలకంఠ,రాష్ట్ర శాప్ నెట్వర్క్ కార్పొరేషన్ చైర్మన్ మాచాని వేంకటేష్, 24వ వార్డు కౌన్సిలర్ రామంజినమ్మ,పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, కౌన్సిలర్లు, ఇన్ ఛార్జ్ లు,వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు,అభిమానులు. తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ గెలుపే నా లక్ష్యం..


**- నియోజకవర్గ అభివృద్ధియే మా కుటుంబ ధ్యేయం.**

ఎమ్మిగనూరు మార్చి 18 విభారె న్యూస్.అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వకర్త శ్రీమతి "బుట్టా రేణుక" కుమారుడు బుట్టా ప్రతూల్,ఎమ్మిగనూరు పట్టణంలో 6వ వార్డు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు.నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తను కలుస్తూ పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలకున్న సమస్యలు వింటూ హామీలు ఇస్తూ నన్ను ఆశీర్వదించండి మీకు తోడుగా నేనున్నాను అంటూ చెప్పడం జరిగింది. రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుకమ్మ ని గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు 6 వ వార్డు కౌన్సిలర్ శివ ప్రసాద్, 5వ వార్డు కౌన్సిలర్ ఆమాన్,కౌన్సిలర్లు, ఇన్ ఛార్జ్ లు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు,అభిమానులు. తదితరులు పాల్గొన్నారు.









# గారుడ విమానంలో విహరించిన శ్రీ యోగానంద నరసింహస్వామి



ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 18 విభారె న్యూస్ :- ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి అహోబిలం 46వ పీఠాధిపతి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాల నరసింహస్వామి గారుడ విమానంలో శ్రీ యోగానంద నరసింహస్వామి గా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా గారుడ విమానంలో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం అహోబిల ఆలయ మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీ జ్వాల నరసింహ స్వామి హనుమంత వాహనంపై కొలువు దీరాడు. పూజలు నిర్వహించిన అనంతరం భాజా భజంత్రీల హర్షద్వనుల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. దిగువ అహోబిలంలో.....దిగువ అహోబిలంలో సోమవారం శ్రీ ప్రహ్లాద వరద స్వామి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు తలుత ఉభయ



దారుల పూజలు అనంతరం హంస వాహనంపై కొలువుదీరిన శ్రీ ప్రహ్లాద వరద స్వామి ఆలయ మాడవీధుల గుండా అహోబిలం మఠం చేరుకున్నారు. మఠం వద్ద పీఠాధిపతి స్వామికి పూజలు నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరదస్వామి సూర్యప్రభ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. జిపిఏ సంపత్, ఓ ఎస్ డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ ల సమక్షంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

# ఎన్నికల నిర్వహణ విధులను సక్రమంగా నిర్వర్తించండి

**----జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**



సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ఎన్నికల నిర్వహణ విధులను సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున నోడల్ అధికారులకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా చేపట్టేందుకు 16 కమిటీల నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలింగ్ విధుల నిర్వహణకు కాంట్రాక్ట్ సిబ్బంది మినహా ఇంకా ఏదేని శాఖల సిబ్బందిని గుర్తించి మంగళవారం సాయంత్రంలోగా ఇవ్వాలని జిల్లా ట్రెజరీ అధికారులను ఆదేశించారు. అలాగే రాండమైజేషన్ పద్ధతిలో విధులు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ షెడ్యూల్ ను పక్కగా రూపొందించుకోవాలని ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లకు కేటాయించే వీడియో గ్రాఫర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో కారణాలు విశ్లేషించి పోలింగ్ శాంతాన్ని పెంచేందుకు ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వృద్ధ ఓటర్లు, వికలాంగ ఓటర్లు, సర్వీస్ ఓటర్లకు వర్తించే పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై కూడా ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ఎన్నికల పరిశీలన నిమిత్తం వచ్చే అబ్జర్వర్లకు వసతి, లైజన్ ఆఫీసర్ల కేటాయింపుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సివిల్ సప్లైస్ డిఎంను జేసి ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మజ, అన్ని కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# అన్ని పార్టీలు ఏకమైన జగన్ ఆపలేవు

ఆళ్ళగడ్డ ప్రతినిధి మార్చి 18 విభారె న్యూస్ :- రాష్ట్రంలో రెండోసారి వైకాపా తప్పకుండా అధికారంలోకి వస్తుందని వైకాపా నాయకులు భూమా కిషోర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన పార్టీలో కేవలం జగన్మోహన్ రెడ్డిని సీఎం కాకుండా చేయాలనే ఆలోచన తప్ప అన్ని పార్టీలు కలిసి రాష్ట్రానికి ఏం చేస్తాయో చెప్పలేదన్నారు. ఆ మూడు పార్టీలకు రాష్ట్రానికి ఉపయోగపడే ప్రణాళిక ఏమీ లేదని కేవలం జగన్మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కాకుండా ఆపడమే ఆ పార్టీల ఎజెండా అన్నారు. అలాగే రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ గెలిచి జగన్ రెండోసారి



ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి వచ్చి పోలవరం ప్రాజెక్టు గురించి గానీ, కడప స్టీలు ఫ్యాక్టరీ గురించి గానీ, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ గురించి గానీ , రాష్ట్రం అవసరమైన పరిశ్రమల గురించి గానీ ఎక్కడ మాట్లాడలేదని పెదుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే తాము మూడు పార్టీలు పొత్తులు పెట్టుకున్నామని ఎక్కడా చెప్పలేదన్నారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ అట్టర్ ప్లాప్ అయిందని ఆయన విమర్శించారు. 2019 సంవత్సరం ఎన్నికల్లో దేశంలో ముస్లింలు, క్రిస్తవులు ప్రశాంతంగా ఉండాలంటే మోడీ లాంటి టెర్రరిస్టులు పోవాలని ఆయన పేర్కొన్నారు. నాడు నరేంద్ర మోడీని తిట్టిన ఇదే చంద్రబాబు నేడు మోడీని పొగడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మూడు పార్టీల నాయకుల్లో సమన్వయం లేదని ఆయన ఆరోపించారు. ఒక్కొక్కరు ఒక్కో మాట మాట్లాడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాకపోయినా మోడీతో సఖ్యతగా ఉంటే కేసుల నుండి తప్పించుకోవచ్చు అన్న ఆలోచన చంద్రబాబులో ఉందన్నారు. ముస్లిం మైనార్టీ ఓట్లు పడవని ఆలోచనతో బిజెపికి చెందిన వ్యక్తిని టిడిపిలో చేర్పించి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని విమర్శించారు. ఎవరిని ట్రిక్కులు చేసినా ఎన్నికల్లో రాష్ట్రంలో వైకాపా జెండా ఎగరడం ఖాయమన్నారు.దీన్ని ఎవరు ఆపలేరన్నారు.

## గరుడ వాహనంపై జ్వాలా నరసింహ స్వామి



--నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం యందు లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం యోగానంద గరుడ విమానం పైన తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ జ్వాలా నరసింహ స్వామి అండ్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు.. ఎగువ అహోబిలం లో ఘనంగా నిర్వహించారు . అహోబిలం బ్రహ్మోత్సవాలకు మార్కెట్ ప్రసాద్ ప్రతి సంవత్సరం కూరగాయల వితరణ చేస్తున్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా కూరగాయలు వితరణ చేసిన మార్కెట్ ప్రసాద్. ఈ కార్యక్రమంలో వేద పండితులు నంద్యాల మార్కెట్ ప్రసాద్. భక్తులు. పాల్గొన్నారు.

# పరిక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

**---జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు**



.---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 18-జిల్లాలో 10వ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం నంద్యాల పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్పీజీ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడ పేపర్ లీకేజైనా క్యూ అర్ కోడ్ తో గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి సెల్ ఫోన్ లు అనుమతించకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. భవిష్యత్తులో జరిగే పరీక్షలు కూడా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఈఓను సూచించామన్నారు.జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలను శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బందోబస్తుతో పాటు మహిళా పోలీస్ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144వ సెక్షన్ తో పాటు జిరాక్స్ సెంటర్లను కూడా మూసి వేయడం జరిగిందన్నారు.

# పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి

- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 18-. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడిన పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా నేడు నంద్యాల జిల్లా నందు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించబడినవి. నంద్యాల జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో 25945 విద్యార్థులకు గాను 24350 విద్యార్థులు ( 93.85. ) పరీక్షకు హాజరుకావటం జరిగినది 1595 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగినది. జిల్లా కలెక్టరు, సూపరింటెండెంట్ అఫ్ పోలీసు మరియు జిల్లా విద్యాశాధికారి 2 పరీక్ష కేంద్రాలను సందర్శించారు . జిల్లా వ్యాప్తంగా 5 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 28 పరీక్షాకేంద్రాలను సందర్శించడం జరిగినది . అదేవిదంగా స్టేట్ అబ్జర్వర్ గారయిన ఆర్ ఎస్ .గంగ భవాని 6 పరీక్ష కేంద్రాలను తనీఖీ చెసినారు. మొత్తం 36 పరీక్షా కేంద్రాలను సోమవారం తనిఖీ చేయడం జరిగింది. సమస్యాత్మాక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని డీఈ వో కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేశారు .



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190